అక్కరకు రాని చుట్టము, మ్రొక్కిన వరమీని వేల్పు అన్నట్టుగా అక్కరకు రాని బంగారమెందుకని ఆలోచించిన తల్లి తన చేతి ఉంగరాన్ని కూతురి కొంగున ముడేసిన వైనం ఏమిటి?

# నాన్న ఉంగరం

గునుపూడి హైస్కూల్లో ముప్పై సంవత్సరాలు 'వాచ్‌మన్'గా పనిచేసిన రామయ్య ఈ మధ్యనే చచ్చిపోయాడు. అంటే అది దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజని కాదు. అలాంటి వాళ్లు ఆ రోజున ఈ దేశంలో కొన్నివేల మంది చచ్చిపోయి ఉంటారు. ఇంకా అంతకంటె ఎక్కువ మంది పుట్టి కూడా ఉంటారు. రోజురోజుకీ పెరిగిపోతూన్న జనారణ్యమూ, తరిగిపోతూన్న మానవతా విలువలే దానికి తార్కాణం. రామయ్య చావు ఊళ్లో ఏ కొద్దిమందినో మాత్రం కదిలించింది.

ఈ ముప్పై ఏళ్లలోనూ ఎంతోమంది హెడ్మాస్టర్లు, అసిస్టెంట్లు మారిపోయారా వూళ్లో. వారితో ఏ బాదరబందీలూ లేకుండా, తన ఉద్యోగానికి ఢోకా లేకుండా నెట్టుకురాగలిగాడంటే, అది వారందరి మంచితనమనేకంటే రామయ్య మంచితనం అంటేనే సమంజసంగా ఉంటుంది.

స్కూల్లోనే కాదు ఊళ్లో అందరికీ రామయ్య మంచితనం గురించి బాగా తెలుసు. ఆ విషయం అతను పోయిననాడే అర్థం అయింది. అతని కళ్ళు చారెడేసి ఉండేవని అంతా అతన్ని పొగిడారు.

రామయ్య పెళ్లాం వరాలు మాత్రం "నాకేం చెప్పి పోయావు నా దేముడో! నా నెలా బతికేది నా రాముడో!" అని అతని మీద నేరాలు మోపి, కంటికి మంటికి ఏకధారగా ఏడ్చింది. వచ్చిన వాళ్లందరూ, "ఊరుకో! ఏం చేస్తాం! ఈ భూమ్మీద ఆడకి నూకలు సెల్లి పోయేయి. సచ్చిపోయినోళ్లతో మనమూ పోతామా! నువ్వే ఇలాగయితే పిల్లలు ఇంకా బెంబేలు పడిపోతారు. ఆల్ల కోసరమైనా నువ్వు బతకాల!" అని చెప్పేసి ఎవరి దారిని వాళ్ళు వెళ్ళిపోయారు.

అంతే! అంతకు ముందు నువ్వెలా బతికేవని గాని, తరవాతెలా బతుకుతావని గాని ఎవరూ అడిగిన పాపాన పోలేదు. దారిన పోయే దెయ్యాన్ని పిలిచి తలకెక్కించుకునే దెవరు?

అవును! తన పిల్లల కోసమైనా బతకాలి వరాలు. చిన్నా చితకా పిల్లలా? కాదు. పెళ్లయి ఇద్దరు పిల్లల్ని కన్న కూతురు గంగి. తన మోజు తీరగానే వాళ్లందర్నీ ఇంట్లో వదలి

పెట్టి వెళ్లాడు అల్లుడు. డాము సైటులో గాంగ్ కూలీగా పనిచేస్తూ రోజూ తాగి తందనా లాడుతూ, గంగిని పొట్టలో కాలేసి తొక్కేవాడు. నానా హింసా పెట్టేవాడు అల్లుడు. వాడితో కాపురం చేయలేక వచ్చేసింది. చెడి పుట్టింటికి వచ్చిన ఆడకూతురు. దాని పిల్లలూనూ. ఎక్కడికి పొమ్మంటుంది? పోతే వాళ్ల కేది ఆధారం? కలో గంజో తమకున్న దాంట్లోనే వాళ్లకీ కొంత పల్చన చేసి పోస్తున్నారు. కూతురు కూడా తిని కూచోకుండా, ఏ మేష్టరు ఇంట్లోనో పాచిపని చేసి అమ్మకి చేదోడు వాదోడుగా ఉంటుంది.

వరాలుకో వంశోద్ధారకుడూ ఉన్నాడు. గాడిదకీ ఒచ్చాయన్నట్లు వాడికీ ఏళ్లొచ్చాయి గాని చదువు చట్టుబండలూ అబ్బలేదు. పైగా ఎక్కడలేని రోషం మాత్రం ఉంది. అబ్బ అమ్మ సంపాదించి పెట్టితే కడుపు నిండా మెక్కి జులాయిగా తిరగడం నేర్చుకున్నాడు.

వీళ్ళ కోసం బతకాలి వరాలు.

ఇన్ని బాధ్యతల్నీ, ఇంతకాలం రామయ్యకి వచ్చే నూట అరవై రూపాయల జీతంలోనే నెరవేర్చేది వరాలు. అన్నపూర్ణమ్మలా అన్నీ సమకూర్చి పెట్టేది. ఎలా సంసారం చక్కబెట్టు కునేదో ఏమో ఎవరికీ తెలియదు. కూడుకు లోటు ఉండేది కాదు. గుడ్డిలో మెల్లగా స్కూలు అధికారులు ప్లే గ్రౌండులో ఓ మూల గుడిసె వేసుకోడానికి అనుమతించారు. దాని వల్ల గూడు సమస్య తీరింది. పండగకీ, పబ్బానికీ కొనుక్కున్న కొత్త గుడ్డ ముక్కలు ఆచ్ఛాదనకి సరిపోయేవి. రామయ్య బతికున్నంతకాలం ఇలా కూడూ, గూడూ, గుడ్డా కొరతలేకుండా పోయింది.

అలాగే సాగిపోతే అది జీవితం కాదు.

అందుకే రామయ్య చచ్చిపోయాడు. పోతూ, పోతూ తన ఐహిక బంధాల్తో బాటు సమస్యలన్నీ కూడా ఇక్కడే ఒదిలి పెట్టివెళ్లాడు.

'నీకేం దేముడో! నువ్వు సక్కగా పల్లకీ ఎక్కి ఎల్లిపోయేవు. నీతో పాటు నేనూ పోతే నాకీ బాదలుండకపోను. మా కట్టాలు సూన్నాడికి నువ్వు లేవు. సూత్తా, సూత్తా ఇందర్నీ నట్టేట్లో ముంచేసి నేను పానాలు తీసుకోలేకపోతున్నాను. తల్లి వేరు సచ్చిపోయిన ఏ సెట్టైనా ఎంత కాలం బతగ్గలదు? ఈ కుటుంబం ఇలా అడుగంటి పోవాల్సిందే గావల్ను!' అని చనిపోయిన రామయ్యని తల్చుకుని రాత్రిళ్లు పరిపరి విధాల పరి తపించిపోయేది వరాలు. కానీ వరాలుకి చావు రాదు. వస్తే ఆమె కూడా రామయ్యలా సుఖపడిపోదూ!

వరాలు కష్టాలు రామయ్య దినవారాలతోనే ప్రారంభం అయ్యాయి. రామయ్య ఇకలేడు గాబట్టి ప్లే గ్రౌండులోని గుడిసెలో ఆ కుటుంబం ఉండడానికి వీలులేదు. కొందరు రామయ్య మంచితనం తెలిసిన బుద్ధిమంతులు రామయ్య కొడుక్కి ఉద్యోగం ఇప్పించి గూడు నిలబెట్టే ప్రయత్నం చేయబోయారు. "ఛ! ఛ! ఖాకీ డ్రస్సు వేసుకుని బంట్రోతులా ఆ ఉద్యోగం నేను చేయను" అన్నాడు వాడు. నిస్సహాయులైన స్కూలు అధికార్లు ఆ కుటుంబాన్ని గుడిసె ఖాళీ చెయ్యమనక తప్పలేదు. కొన్నాళ్ళు గడువు మాత్రం ఇచ్చారు.

తానొక్కర్తే అయితే, వరాలు ఏ చెట్టు కిందనో, గట్టు మీదనో కాలం వెళ్లబుచ్చేది. కానీ, కూతురు గంగి, దాని పిల్లలు, కొడుకు - ఇంత మందిని ఏ చెట్టు నీడ మాత్రం

ఏమావుతుంది? చచ్చిపోయిన రామయ్య తెలివైనవాడు. అన్నిటి కంటే గడ్డు సమస్యనే మొదటి పరీక్షగా వరాలు నెత్తిన మోపిపోయాడు. ఎందుకంటే కూడూ, గుడ్డా అడుక్కునైనా సంపాదించవచ్చు. "తల్లీ మాదాకబళం!" అంటే ఏ కన్నతల్లైనా ఓ కబళం వస్తుంది. "ఆచ్ఛాదనకి లేదమ్మా!" అంటే హృదయమున్న ఓ తల్లి కట్టి విడిచిన పాత చీరైనా ఇస్తుంది. కాని గూడు? ఉండడానికి ఇల్లు? అది దానం చేసేంతటి ధర్మాత్ములు ఎవరు? ఎక్కడో జానెడు నేల కొనుక్కుని దానిమీద ఓ గుడిసె వేసుకోవడమే గత్యంతరం.

తప్పనిసరిగా తల్లీ, కూతురూ, ఊరవతల దూరంగా విసిరేసినట్టున్న ఓ స్థలం బేరం చేశారు. వాడు మొదట చెట్టెక్కి కూచున్నా, వీళ్ల దీనావస్థ చూసి కనీసం అయిదు వేలిస్తే ఆ స్థలం వాళ్ళకి రాసిచ్చేస్తానన్నడు.

ఆ రోజు రాత్రి పడుకున్నప్పుడు గంగి తల్లితో అంది "అమ్మా! నీతో చెప్పకేం? ఈ పిల్ల కాయలకేనాడేనా అక్కరకొస్తుందని అడపాదడపా నేను దాచుకున్న డబ్బు రెండు వేల దాకా ఉంది. మిగతా డబ్బు నువ్వు చూసుకోగలవా?" అని.

"అదే నేనూ అనుకుంటున్నాను. అంట్లు తోమి, ఇల్లు ఊడిసి నేను సంపాయించిన దాంట్లో దినవెచ్చాలకి పోను మిగిలింది రామారావు మేష్టారి కాడ దాసాను. అది ఓ రెండు వేలయిందని ఈ మద్దెనే మేష్టారన్నారు. అయన దేముడి నాటోడు, అడిగితే ఇచ్చేత్తాడు. కానీ, ఇంకో వెయ్యి రూపాయలు గావాలే! అయ్యేలా వొత్తాయి?" అంది వరాలు అట్నుంచి ఇటు తిరుగుతూ.

ఆ తిరగడంలో బుడ్డిదీపం వెలుతురులో తళతళా మెరిసింది వరాలు చేతి బంగారపు ఉంగరం. అదే వెల్తురులో గంగి కళ్లలో మెరుపు చూసింది వరాలు. దానికి కారణం కూడా ఊహించగలిగింది ఆమె చూపుల్ని బట్టి.

"అమ్మా!" అని నెమ్మదిగా గంగి అన్న మాటలో వెయ్యి అర్థాలు గోచరించాయి వరాలుకి. ఆమె గుండెల్లో రాయి పడింది. ఆ పిలుపుకి సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయింది వరాలు. ఆ ఉంగరంతో భార్యభర్తల ఇద్దరి జీవితాలు ముడిపడి ఉన్నాయి. దానిని వరాలు ఒకంతట విస్మరించలేదు. అదో కథ.

అవి వరాలు, రామయ్య కొత్తగా కాపురం పెట్టుకున్న రోజులు. ఎంత బీదరికంలో ఉన్నా, అంతకు తగ్గ కోరికలే ఉన్న వరాలుకి.  జీవితం ఆనందంగానే గడిచిపోతోంది. అన్నిటినీ మించి రామయ్యకు ఆమె అంటే ప్రాణం. వాళ్ల సంసారంలో ఒడిదుడుకులు లేవు. కాని రామయ్యకి ఓ చిత్రమైన కోరిక ఉండేది. ఎలాగైనా ఓ బంగారు ఉంగరం చేయించుకుని వేలికి పెట్టుకోవాలని. ఏ పరిస్థితుల్లో అతని మనసులో ఆ కోరిక అంకురించిందో అతనికే అంతు పట్టలేదు. కాని అది దినదిన ప్రవర్థమానమై, తీరేవరకు అతన్ని నిద్రపోనీయలేదు. అహోరాత్రులు కష్టపడి పనిచేసి, పైసా, పైసా పోగు చేసి ఆఖరికి సాధించాడు.  ఆ బంగారపు ఉంగరం తన వ్రేలికి పెట్టుకుని వారధి లంఘించినట్టుగా సంతోషించాడు. కనిపించిన ప్రతీ వాళ్లకీ చూపించి, "అసలు బంగారం" అని చెప్పేడు. అందరూ పొగిడితే తను పొంగిపోయేడు. ఇంట్లో పిల్లలకి, తనకీ ఏ లోటూ చేయకుండా చూసుకుంటూ, పిసరంత బంగారం కొనుక్కున్న మొగుడ్ని చూసి మురిసిపోయింది వరాలు.

"ఆడికదేం పిచ్చే! ఆ ఉంగరం చేతికమిరే వరకు ఒకటే సొద!" అని లోలోపలే సంబరపడింది. రామయ్య చచ్చిపోయేవరకు ఆ ఉంగరాన్ని తన శరీరం నుంచి వేరుచేయ లేదు. అతను పోయిన్నాడు ఆ వ్రేలి ఉంగరాన్ని తీసేస్తుంటే గుండె గొంతుకలో కొచ్చినట్టయింది వరాలుకి. ఎవరో పునిస్త్రీ ఆ ఉంగరాన్ని తన వ్రేలికి తొడిగింది.

ఆ ఉంగరం ఉన్న వ్రేలుని గుండెల మీద పెట్టుకుని పడుకుంటే రామయ్య ప్రక్కన ఉన్నట్టే ఉంది వరాలుకి. అంత కత ఉంది ఆ ఉంగరానికి. అలాంటిది ఈనాడూ ఈ అవుసరం కోసం దాన్ని అమ్మేయడమే!

అమ్మ మనసు తెలీని కూతురుండదు. కూతురి కోరిక కనుక్కోలేని తల్లి ఉండదు.

"అమ్మా! ఈ ఉంగరాన్ని అమ్మేద్దామే! వెయ్యి రూపాయిలొత్తాయి" అని గంగి వరాలు నడవలేకపోయింది. అది నాన్న బంగారు ఉంగరం. ఆ అనుబంధం తనకి తెలియంది కాదు.

'అమ్మో! ఇది నాపంచ ప్రాణాలూనూ. నేనియ్య'నని తల్లి నిరాకరించనూ లేదు. మూగబోయిన వారి కంఠాలు ఆ రాత్రి ఎన్నో మాట్లాడుకున్నాయి. ఎటూ తేల్చుకోలేకపోయా రిద్దరూ. అలసిన శరీరం సేదగోరి గంగి నిద్దట్లోకి జారుకుంది. వరాలుకు నిద్ర పట్టలేదు. పదే పదే ఉంగరం మీదికే దృష్టి పోతోంది. అందులో రామయ్య కనిపిస్తున్నాడు. అతనితో ఇలా చెప్పింది - "ఈ ఉంగరం ఉన్నా లేకున్నా నా మనసులో నువ్వున్నావు మావా! ఇది నేను ఇయ్యాల దాసేసుకుంటే నీ పిల్లలు చెట్టు నీడ లేని పిట్టలైపోతారు. ఆ తరువాత ఇది ఎవరికి అక్కరకు రావాల? ఇలాటియ్యి అవసరానికి ఆదుకోకపోతే ఈటికి ఇలవేటి? బతికుంటే బలుసాకేం కర్మా, దేముడు సల్లంగా సూత్తే నా పిల్లలు ఇంతకింత బంగారం కొనుక్కోలేకపోతారా? ఉన్ననాడు ఈ ఉంగరం అందుకే చేయించావేమో! ఆల్లకోదారి సూపించి, నాను నీకాడ కొచ్చేత్తన్నాను". అంతే! ఆ ధృఢ నిశ్చయంతో వరాలు వ్రేలికున్న ఉంగరాన్ని తీసి నిద్రపోతున్న గంగి కొంగుకి గట్టిగా ముడి వేసింది. వ్రేలి నుండి ఉంగరం తీసుకున్నప్పుడు వరాలుకి తన శరీరంలోని ఓ అవయాన్ని ఎవరో కోసి తీసేస్తున్నట్టనిపించింది.

ప్రొద్దుటే లేచి ఉంగరంతో గట్టిగా తగిలిన కొంగుముడి చూసుకుని ఆశ్చర్యపోయింది గంగి. అమ్మకేసి కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. 'మా అమ్మ శానా మంచిది. అడక్కుండానే అన్నీ పెట్టేది. ఇయ్యాల ఈ ఉంగరమూ అంతే! ఇక ఉండడానికి మాకో గూడు ఏర్పడినట్టే' అనుకుంటూ సంతోషంతో అమ్మ శరీరం మీద చేయి వేసింది. మంచుగడ్డలా తగిలింది. "ఎంతపని చేశావే అమ్మా! మాకో దిక్కు సూపించి నువ్వు నాన్న కాడికెల్లి పోయేవా?" అని నెత్తీనోరు బాదుకుని ఏడ్చింది.

అయిదు వేల రూపాయలకే ఆ స్థలం కొని ఇల్లు వేయించి గంగి పిల్లల పేర్న, తలి మైనరు గార్డియనుగా రిజిష్టరు చేయించారు, దేముడు లాంటి రామారావు మాష్టారు. ఇంటి విషయం తెలిసి 'కలిసి బతుకుదాం' అని తిరిగొచ్చిన మొగుడికి మొండి చేయి చూపించింది గంగి.

✶